వైభవంగా లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణం

తిరునక్షత్రోత్సవంలో భాగంగా ప్రబంధ పాశురాలను పఠిస్తున్న పారాయణదారులు

యాదగిరిగుట్ట, మే 11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. శనివారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. స్వామివారిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా కల్యాణతంతు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిపారు. స్వామివారిని 28 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ. 37,92,008 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారి ప్రధానాలయంలో జగద్గురు భగవద్రామానుజాచార్యులు ఆధ్వర్యంలో తిరునక్షత్రోత్సవం నిర్వహించారు. రెండో రోజులో భాగంగా తొళక్కం నిర్వహించి దివ్య ప్రబంధ పాశురాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు, పారాయణదారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోనే కార్యకర్తలకు గుర్తింపు

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మోత్కూరు, మే 11 : బీఆర్ఎస్‌లోనే కార్యకర్తలకు గౌరవం, గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురానికి చెందిన పలువురు భువనగిరిలో శనివారం జరిగిన కార్యక్రమంలో జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పంజాల మహేందర్, బొనగ రవీందర్, యాట నరేశ్, నర్సిరెడ్డితోపాటు 10 కుటుంబాలకు చెందిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణాధ్యక్షులు రమేశ్, శ్రీను, సహకార సంఘం డైరెక్టర్ సామ పద్మారెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది కేటాయింపులు పూర్తి

ర్యాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్న జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయుమ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 11 : భువనగిరి, ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్ల లోని 566 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మూడో విడుత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బంది కేటాయింపులు పూర్తయ్యాయి. శనివారం జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయుమ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే సమక్షంలో 2,264 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర అధికారులకు మూడో విడుత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. 368 మంది రిజర్వులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, నోడల్ అధికారి, డీఈఓ నారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు జై కొడుతున్న అన్ని వర్గాలు

- ఆ పార్టీ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం) సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), మే 11 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం మండల వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌కు జై కొడుతూ మద్దతు తెలుపుతున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయకుండా మోసం చేయడంతో ప్రజలంతా కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలనే నిర్ణయంతో ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్యామ మల్లేశ్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, జిల్లా నాయకులు ఇంద్రారెడ్డి, భిక్షపతి, ఉప్పలయ్య, రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దశరథగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, నర్సింహ, సత్తయ్య, రాజు, రాములు, స్వామి, నాగరాజు, మణికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

- మాజీ ఎంపీటీసీ అంజయ్య

కొలనుపాకలో మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ అంజయ్య

ఆలేరు రూరల్, మే 11 : మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎంపీటీసీ మామిడాల అంజయ్య అన్నారు. శనివారం మండలంలోని కొలనుపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, నీల మురళి, బాశెట్టి రాజు, కాయితి శేఖర్‌రెడ్డి, సొంటెం ప్రవీణ్, చిరబోయిన నరేశ్, నిమ్మల శంకర్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- నియోజవకర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం

రామన్నపేటలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, మే 11 : హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారన్నారు. శ్రీమంతులు, పెట్టుబడిదారులకే మోదీ ప్రభుత్వం పట్టం కట్టిందని, పేదలకు అండగా నిలిచేది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే అన్నారు. మోసపూరిత హామీలు, మత రాజకీయాలు చేస్తున్న పార్టీలను పక్కనబెట్టి సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి చేసే బీఆర్ఎస్‌కు ప్రజలు మద్దతు పలుకాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ, అధ్యక్ష కార్యదర్శులు పోతరాజు సాయికుమార్, జాడ సంతోష్, నాయకులు బందెల రాములు, ఎస్‌కే చాంద్, సాల్వేరు అశోక్, మిర్యాల మల్లేశం, లవణం రాము, గోదాసు ప్రవీణ్, బొడ్డు అల్లయ్య, ఖదీర్, గాదె రాము, అమర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం.

ఆలేరు రూరల్ : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ.. శనివారం మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 ఏండ్ల పాలనలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, పథకాల అమలును వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాజాపేట : క్యామ మల్లేశ్ గెలుపు కోసం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు గుర్రం నర్సింహులు, మర్ల నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, నాయకులు సందిల భాస్కర్‌గౌడ్, బిల్లకుదురు రాజు, బూరుగు భాగ్యమ్మానర్సిరెడ్డి, మేక వెంకటేశ్వర్ రెడ్డి, కటకం స్వామి, వెంకటేశం, భోగ హరి నాథ్, రెడ్డబోయిన రాజు, అబీద్, రేగు సిద్ధులు, చింతల దాసు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతో పాటు రాఘవాపురం, కొరటికల్, పుల్లాయిగూడెం, సింగారం, సర్వేపల్లి, తుక్కాపురంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాస కవిత, నాయకులు ధనలక్ష్మి, అరుణ, గ్రామశాఖ అధ్యక్షుడు వెంకన్న, స్వామి, రాజు, లింగయ్య, ఉపేందర్‌రెడ్డి, రాంబాబు, వెంకన్న, అశోక్, విశాల్, అనిల్, సతీశ్ పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంతోపాటు వాసాలమర్రి, దత్తాయిపల్లి, చిన్నలక్ష్మాపురం, నాగాయపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. నమూనా ఈవీఎం చూపిస్తూ ఓట్లు అడిగారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు పలుగుల నవీన్‌కుమార్, ఎంపీటీసీ గిద్దె కరుణాకర్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి తలారి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు రహమత్ షరీఫ్, యాకూబ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : క్యామ మల్లేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆకాశ్ ప్రజా ఫౌండేషన్(ఏపీఎఫ్) చైర్మన్ దుబ్బాక ఆకాశ్‌రెడ్డి కోరారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కారుగుర్తు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సుక్క యాదయ్య, కానుగు శ్రీకాంత్, కానుగు జంగయ్య, గోరేమియా, గుండెబోయిన బాలకృష్ణయాదవ్, సయ్యద్, సుంకయ్య, దేశట్ల రాజు, నూనె వినోద్, నవీన్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నమూనా ఈవీఎం చూపిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, చింతకింది కిరణ్, వంగూరి పెంటయ్య, గుండు ప్రవీణ్, పగిడిమర్రి రాజశేఖర్, మక్తాల పోచయ్య, దేవరాయ శంకరయ్య, బావండ్ల రాజు, బొడిగె లింగం, గునిగంటి నర్సింహ, బైరు భిక్షపతి, వెంకటేశం పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని మాల్లరెడ్డిగూడెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నర్రి నర్సింహ, గ్రామ శాఖ అధ్యక్షుడు జినుకుల కిరణ్, నాయకులు కొండ శ్రీను, చంద్రశేఖర్, సిరపంగి పెద్దులు, జనార్దన్, నర్సింహ, మల్లేశ్, ఫకీర్, జంగయ్య పాల్గొన్నారు.

భువనగిరి సిటీ : భువనగిరి పట్టణంలో 8వ వార్డ్ రామ్‌నగర్, జంకన్నగూడెం, నందగుట్ట, సీతానగర్‌లో ముమ్మర ప్రచారం చేశారు. కౌన్సిలర్ పంగరెక్క స్వామి, కో ఆప్షన్ సభ్యులు ఇట్టబోయిన సబితాగోపాల్, పావని, సుదర్శన్, సత్యనారాయణ, వార్డు ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు భూమండ్ల సుధీర్, నాయకులు ఎగ్గిడి కృష్ణ, ఐలయ్య, లింగం, నర్సింహయాదవ్, యాదయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరుతూ మండల నాయకులు పైళ్ల లక్ష్మారెడ్డి, వేముల సురేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని మేడిపల్లి, తూంకుంట, చీకటి మామిడి, నాగినేనిపల్లిలో ప్రచారం నిర్వహించారు. భట్కీర్ బీరప్ప, బుడమ వెంకటేశ్, రాజు, బండి మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : శారాజీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజాపేట : ప్రచారం నిర్వహిస్తున్న ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింహులు, నాయకులు

తుర్కపల్లి : వాసాలమర్రిలో ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు

భూదాన్‌పోచంపల్లి : కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్

ఆత్మకూరు(ఎం)లో ఇంటింటి ప్రచారం చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు

చౌటుప్పల్ : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆకాశ్ ప్రజా ఫౌండేషన్(ఏపీఎఫ్) చైర్మన్ దుబ్బాక ఆకాశ్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం : మల్లారెడ్డిగూడెంలో ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి సిటీ : కారు గుర్తుకు ఓటేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోటకొండూర్ : ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

బొమ్మలరామారం : మేడిపల్లిలో ఉపాధి హామీ కూలీలను ఓట్లు అడుగుతున్న బీఆర్ఎస్ నాయకులు

హైవేపై వాహనాల బారులు

చౌటుప్పల్‌లో బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్, మే 11 : చౌటుప్పల్ పట్టణంలో 65వ జాతీయ రహదారిపై శనివారం వాహనాలు బారులుదీరాయి. ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రజలు సొంతూళ్లకు ప్రయాణం కావడంతో వాహనాల రద్దీ నెలకొంది. పట్టణ కేంద్రంలో నల్లగొండ వైపు వెళ్లే వాహనాలు అధిక సంఖ్యలో నిలిచిపోయాయి.

దాంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆదివారం తెల్లవారుజామున మరింత పెరిగే అవకాశం ఉంది.

పీఏసీఎస్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

- సంస్థాన్‌నారాయణపురంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా

పీఏసీఎస్ చైర్మన్ జంగారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

సంస్థాన్ నారాయణపురం, మే 11 : ధాన్యం కొనుగోళ్లు, పెట్రోల్ బంక్ నిధుల విషయంలో దాదాపు రూ.6 కోట్ల అవినితికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డిపై చర్యలు తీసుకోవాలని శనివారం మండల కేంద్రంలో అఖిలపక్ష నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. జంగారెడ్డి, సిబ్బంది ధాన్యం కొనుగోలు విషయంలో తాలు, మ్యాచ్చర్ పేరిట బస్తాకు మూడు కిలోలు అదనంగా కోతలు విధిస్తున్నారని పేర్కొన్నారు. రైస్‌మిల్లర్లు, జంగారెడ్డి కుమ్మకై లారీకి 5 నంపచి 6 కింటాళ్లు అదనంగా తరుగు తీస్తూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. గత సంవత్సరం 400 లారీల ధాన్యం కొనుగోలు జరిగిందని, దాని ప్రకారం దాదాపు రూ.6 కోట్ల వరకు అవినీతి జరిగినట్లు పేర్కొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉన్నతాధికారులు స్పందించి పీఏసీఎస్ చైర్మన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజు, నర్రి నర్సింహ, జక్కడి ధన్వంత్‌రెడ్డి, వడ్డేపల్లి రాములు, లారి భిక్షం, తెలంగాణ భిక్షం, సూరపల్లి శివాజీ, బండమీది కిరణ్, రాసాల వెంకటేశ్, నీళ్ల లింగస్వామి, ఉప్పల శ్రీను, చింతకింది ఉషా, అచ్చిని ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎలాంటి అవినితికు పాల్పడలేదు : జక్కిడి

ఈ విషయమై జంగారెడ్డిని వివరణ కోరగా.. అఖిలపక్షాలు ఆరోపిస్తున్నట్లు తాను పీఏసీఎస్‌లో ఒక్క రూపాయి అవినీతికి పాల్పడ లేదన్నారు. ప్రతిదీ పీఏసీఎస్ డైరెక్టర్ల తీర్మానంతోనే పని చేశామన్నారు. అవినీతి చేసినట్లు నిరూపిస్తూ ఎలాంటి శిక్షకైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

బీబీనగర్, మే 11 : గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెందినట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని బీబీనగర్- పగిడిపల్లి మధ్య 228/5-7 ఎగువ లైన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు నంపచి జారిపడి మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు బ్లాక్ టీషర్ట్, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. సుమారు 40 ఏండ్ల వయసు ఉంటుందన్నారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానలో భద్రపరిచామని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9848223169, 8712568454 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

ఆర్థిక సాయం

రామన్నపేట, మే11 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన కర్రె బుగ్గమ్మ రెండ్రోజుల క్రితం మృతి చెందింది. శనివారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పున్న వెంకటేశం, కార్యదర్శి పిట్ట హహేందర్‌రెడ్డి, మత్స్యకార్మిక సంఘం చైర్మన్ కర్రె రమేశ్, ఎడ్ల నరేందర్‌రెడ్డి, రాపోలు ఎల్లయ్య, వరికుప్పల కాశీరాం, భాస్కర్‌భాస్కర్, సుదర్శన్, రవి పాల్గొన్నారు.

ఎండకు తాళ లేక..

భానుడి ప్రతాపానికి తోడు వడగాడ్పులు వీస్తుండడంతో మనుషులతోపాటు జీవాలు తల్లడిల్లుతున్నాయి. గొర్రెలకాపరులు మేత కోసం జీవాలను తోలుకెళ్లినప్పుడు ఎండ వేడిమి తట్టుకోలేక మేత మేయడం మాని చెట్ల నీడకు చేరుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకే ఎండ వేడి అధికంగా ఉండడంతో ఆత్మకూరు(ఎం) శివారులో చెట్టు నీడన గొర్రెల మంద సేద తీరుతూ కనిపించింది.

-ఆత్మకూరు(ఎం), మే 11

కునపురి సోదరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

- భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్



దాసిరెడ్డిగూడెంలో కునపురి రాములు స్మారక స్తూపానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, ఆ పార్టీ నాయకులు

వలిగొండ, మే 11 : కునపురి సాంబిశివుడు, కునపురి రాములు ఆశయ సాధనకు కృషి చేయాలని భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. శనివారం మండలంలోని దాసిరెడ్డిగూడెంలో నిర్వహించిన కునపురి రాములు వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన స్మారక స్తూపానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ కునపురి సోదరులు వారి జీవితాలను పీడిత ప్రజల హక్కులు, దళిత గిరిజనుల అభ్యున్నతి కోసం త్యాగం చేసినట్లు పేర్కొన్నారు. పెట్టుబడి, పెత్తందార్ల దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మొగుళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, కొమిరెల్లి సంజీవ రెడ్డి, పనుమటి మమతానరేందర్‌రెడ్డి, పల్సం రమేశ్, మద్దెల మంజుల, కొండూరి వెంకటేశం, అయిటిపాముల ప్రభాకర్, సత్యనారాయణ, పబ్బు వెంకట్‌రమణ పాల్గొన్నారు.

సాయిబాలాజీ రైస్‌మిల్ యాజమాన్యం దౌర్జన్యం

- ధాన్యం దిగుమతి చేసుకోమన్నందుకు లారీ అద్దాలు ధ్వంసం

ధర్నా చేస్తున్న డ్రైవర్ల యూనియన్ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, మే 11 : ధాన్యం దిగుమతి కోసం వచ్చిన లారీ అద్దాలను రైస్ మిల్ యాజమాన్యం ధ్వంసం చేసిన సంఘటన శనివారం మండలంలోని పిలాయిపల్లి శివారులో చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ రాజు, యజమాని నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం నుంచి సాయి బాలాజీ రైస్‌మిల్లుకు ధాన్యం తీసుకొచ్చాం. రైస్‌మిల్ యాజమాన్యం రెండ్రోజులుగా ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో దిగుమతి చేసుకోవాలని అడిగినందుకు యజమాని ఏనుగు యాదిరెడ్డి, అతని కుమారులు శేఖర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి అసభ్య పదజాలంతో తమపై విరుచుకుపడ్డారు. నీరియల్‌గా ఉన్న తమ బండిని కాదని, రైస్‌మిల్‌కు చెందిన లారీల నుంచి ధాన్యం దిగుమతి చేసుకుంటున్నారని ప్రశ్నించినందుకు.. ఇక్కడి నుంచి మీ లారీని తీయాలని, లేకుంటే డీజిల్ పోసి తగులబెడుతామని బెదిరించారు. సీరియల్ గురించి చెప్పడానికి మీరెవరంటూ లారీపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మక్తాల రమేశ్‌గౌడ్‌కు తెలుపగా ఆయన అక్కడికి వచ్చి పెద్దల సమక్షంలో ప్రశ్నించినా రైస్‌మిల్ యజమాని వినలేదు.

తిరిగి తమపైనే తప్పుడు కేసు పెట్టాలని ప్రయత్నించడంతో ఆగ్రహించిన డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాం. ఈ విషయం ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డికి తెలిసి ఆయన అక్కడికి వచ్చి చెప్పినా రైస్‌మిల్ యజమాని వినకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.